
సాక్షి
అనంతపురం
మంగళవారం ; 21 ; ఫిబ్రవరి ; 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
37.4°/13.9°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నాలుగైదు రోజుల వరకే హెచ్చెల్సీకి నీరు



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి కేటాయించిన అదనపు కోటా ముగియనుండడంతో మరో నాలుగైదు రోజుల్లో నీటి సరఫరా నిలిచిపోనుందని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. ఈ ఏడాది దామాషా ప్రకారం అదనపు కోటా కలిపి 32.821 టీఎంసీ కేటాయించారని పేర్కొన్నారు. అదనపు కోటాలో 0.6 టీఎంసీలు మాత్రమే రావాల్సి ఉందని వివరించారు. దీంతో నాలుగు, ఐదు రోజుల్లో మొత్తం నీటి కోటా పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం నుంచి 1,479 క్యూసెక్కుల చొప్పున నీళ్లు వస్తున్నాయన్నారు. పీఏబీఆర్‌లో 4.82 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 3.20 టీఎంసీల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



అనంతపురం: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనంతపురం జిల్లాలో మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు ఆర్‌ఐఓ డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. 578 మంది విద్యార్థులకు గాను 547 మంది పరీక్షలు రాశారు. 31 మంది గైర్హాజరయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా

రాప్తాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అడిషనల్ డీజీ, రాష్ట్ర సచివాలయాల ఇన్‌చార్జ్, రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. ఆయన సోమవారం ఎస్పీ ఫక్కీరప్పతో కలిసి రాప్తాడు–1 సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన పోస్టర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయా అని ఆరా తీశారు. ఎప్పటికప్పుడు తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తున్నామని, పెండింగ్ ఏవీ లేవని తెలపడంతో సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఇటుకలపల్లి సీఐ మోహన్, ఎస్‌ఐ ఆంజనేయులు, ఎంపీడీఓ సాల్మన్ పాల్గొన్నారు.

కాస్మోటిక్, డైట్ చార్జీల పెంపు

- 14వేల మంది విద్యార్థులకు లబ్ధి



అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు జగన్ సర్కార్ శుభవార్త చెప్పింది. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 53 బీసీ వసతి గృహాల పరిధిలో 6,500 మంది, 11 ఎస్టీ హాస్టళ్లలో 3,040 మంది, 58 ఎస్సీ హాస్టళ్లలో 4,500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గతంలో మూడో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు డైట్ చార్జీలు రూ.1,000 ఉండగా తాజాగా రూ.1,150కు పెరిగింది. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,250 నుంచి 1,450కు, ఇంటర్ నుంచి ఆపైన చదివే విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ.1,600 పెరిగాయి. కాస్మోటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి బాలురకు రూ.110 నుంచి రూ.160, బాలికలకు రూ.110 నుంచి రూ.130, ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ 200, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మాటిస్తే తప్పేది లేదన్న విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు.. బ్యాక్ బోన్ (వెన్నెముక) అని చేతల్లో చూపించారు. తాజాగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటును వాల్మీకి (బోయ) సామాజిక వర్గానికి చెందిన సానిపల్లి మంగమ్మకు కేటాయించడం ఇందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో ఆ పార్టీ కాంట్రాక్టర్లకు, పారిశ్రామిక వేత్తలకు మాత్రమే రాజ్యసభ, శాసనమండలి స్థానాలు దక్కేవి. బీసీలకు పదవులు అందని ద్రాక్షలాగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు పెద్దపీట వేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీలను రాజకీయంగా, పదవుల పరంగా అగ్రభాగంలో నిలబెట్టారు. – సాక్షి ప్రతినిధి, అనంతపురం

బీసీలకు పెద్దపీట

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సానిపల్లి మంగమ్మ ఎంపికపై హర్షాతిరేకాలు
- బోయ సామాజిక వర్గానికి విశేష ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో కురుబలు, ఇతర వర్గాలకూ పెద్దపీట
- సీఎం జగన్ నిర్ణయాలను స్వాగతిస్తున్న ప్రజలు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజమ్మ, పైలా నరసింహయ్య తదితరులు

మాజీ ఎంపీ సానిపల్లి గంగాధర్ సతీమణి మంగమ్మను వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బోయ సామాజిక వర్గానికి చెందిన ఈమెను మండలికి పంపించాలన్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ఉమ్మడి జిల్లాలోని బీసీ వర్గాలు స్వాగతిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే బోయ సామాజిక వర్గానికే చెందిన తలారి రంగయ్యకు అనంతపురం ఎంపీ సీటిచ్చి గెలిపించారు. గిరిజమ్మను జెడ్పీ చైర్‌పర్సన్ చేశారు. లిఖితకు ఏడీసీసీబీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. తాజాగా మంగమ్మకు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం విశేషం.

బోయ, కురుబలకు సముచిత స్థానం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బోయ, కురుబ సామాజిక వర్గాల జనాభా ఎక్కువగా ఉంది. ఇందుకు అనుగుణంగానే వారికి వైఎస్ జగన్ రాజకీయంగా పెద్దపీట వేస్తున్నారు. ఇందులో భాగంగా 2019 ఎన్నికల్లో కురుబల్లో గోరంట్ల మాధవ్‌కు హిందూపురం ఎంపీ సీటు, శంకర్‌నారాయణ (పెనుకొండ), ఉషశ్రీ (కళ్యాణదుర్గం)లకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి గెలిపించారు. కురుబ సామాజిక వర్గం వారికే రెండు సార్లు మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా వారిని గౌరవించారు. ఇక అనంతపురం ఎంపీ సీటు గతంలో ఎక్కువగా ఓసీ కేటగిరీకి కేటాయించేవారు. అలాంటి స్థానాన్ని కూడా గత ఎన్నికల్లో బీసీకి కేటాయించి గెలిపించిన ఘనత జగన్‌దేనన్న చర్చ జనంలో జోరుగా సాగుతోంది. నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలంటే కేవలం ఓట్లు, నోట్లు చూసే టీడీపీకి ఇది పెద్ద చెంపపెట్టు అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మైనార్టీలకు కూడా జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్బాల్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో పాటు అనంతపురం మేయర్ పదవిని వసీంకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. ఏదిఏమైనా వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని సీఎం జగన్ మరోసారి నిరూపించారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం చేకూరుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. రాష్ట్రంలోని 18 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు గాను 12 స్థానాలను బీసీ వర్గాలకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి ఆమె క్షీరాభిషేకం చేసి, మాట్లాడారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పేరుతో బీసీలను వంచనకు గురి చేస్తున్నాయన్నారు. ఇందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి పెద్ద పీట వేసి సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నారని కొనియాడారు. ఇందులోనూ మహిళాభ్యున్నతికి ప్రాధాన్యతనివ్వడం మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు కిష్టప్ప, వ్యవసాయ మిషన్ సభ్యుడు బోయ రాజారాం, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్, శ్రీదేవి, పెన్నోబులేసు, మునీరాబేగం, రాధాయాదవ్, రిలాక్స్ నాగరాజు, గోగుల పుల్లయ్య, చింతకుంట మధు, అనిల్‌కుమార్ గౌడ్, వెన్నపూస రామచంద్రారెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, రహంతుల్లా, శ్రీనివాసులు, బాబాఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంగమ్మకు ఎమ్మెల్సీ!

- స్థానిక సంస్థల కోటాలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన వైఎస్సార్ సీపీ



సానిపల్లి మంగమ్మ

పెనుకొండ: హిందూపురం పార్లమెంట్ మాజీ సభ్యులు దివంగత సానిపల్లి గంగాధర్ సతీమణి సానిపల్లి మంగమ్మకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ స్థానం కేటాయించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆమె పేరు ప్రకటించారు. దీంతో మంగమ్మ కుటుంబీకులు, సన్నిహితులు, వాల్మీకి కులస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

మంగమ్మ కుటుంబ నేపథ్యం..

కళ్యాణదుర్గం మండలం శీబావి గ్రామానికి చెందిన మంగమ్మది సాధారణ మధ్య తరగతి కుటుంబం. 1979లో పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన సానిపల్లి గంగాధర్‌తో వివాహమైంది. గంగాధర్ 1987లో గుట్టూరు సింగిల్‌విండో అధ్యక్షులుగా పని చేశారు. అప్పటికే యంగ్ ఇండియా సంస్థలో క్రియాశీలకంగా పనిచేసిన గంగాధర్ రాజకీయ చైతన్యాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు బేడీ గుర్తించారు. రాజీవ్‌గాంధీతో మాట్లాడి 1989లో హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇప్పించారు. అప్పట్లో ఆయన ఎంపీగా గెలిచారు. మళ్లీ 1991 నుంచి 1996 ప్రారంభం వరకు ఎంపీగా కొనసాగారు. 1996లో రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి చవి చూశారు. 1998లో అదే రామచంద్రారెడ్డిపై గెలిచారు. ఆతర్వాత 1999లో వచ్చిన ఎన్నికల్లో బీకే పార్థసారథి చేతిలో ఓడిపోయారు. అనంతరం గంగాధర్ అనారోగ్యంతో మరణించారు. ఆయన సతీమణి సానిపల్లి మంగమ్మ తమకు రాజకీయంగా అండగా నిలిచిన వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట నడిచారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలనేపథ్యంలో వైఎస్సార్‌సీపీ లో చేరి పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్తగా, సీఈసీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ అభివృద్ధికి పాటుపడ్డారు. నమ్ముకుని వెంట నడిచిందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏకంగా ఎమ్మెల్సీ సీటు కేటాయించడంతో మంగమ్మ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వగ్రామంలో సంబరాలు

కళ్యాణదుర్గం: మంగమ్మను స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించగానే ఆమె స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం శీబావిలో సంబరాలు అంబరాన్నంటాయి. కుటుంబ సభ్యులు రామచంద్ర, మల్లరాయుడు, శివాజీ, అశోక్, సర్వోత్తమలతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోళ్ల మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ అబ్దుల్ రెహమాన్, తిప్పేష్, రామాంజి, వడ్డే రామాంజి, నాగేంద్ర, తిమ్మప్ప, పోతేష్, ప్రహ్లాద తదితరులు అనంతపురం ప్రధాన రహదారిపై బాణాసంచా పేల్చారు. స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. తమ ఆడపడుచుకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీ–ఫారం అందుకునేందుకు తన సోదరి మంగమ్మతో కలిసి అశ్వర్థ, స్థానికులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకుంటున్న శీబావి గ్రామస్తులు

చిరుధాన్యాల సాగుపై దృష్టి

అనంతపురం అగ్రికల్చర్: ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాదిగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కూడా ఆయా పంటల విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ సూచించారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ ఏక పంటగా విస్తరించిన వేరుశనగను తగ్గించి.. సజ్జ, రాగి, కొర్ర, జొన్నతో పాటు సంప్రదాయ పంటలైన అరిక, సామ, అండుకొర్ర, ఊద లాంటి వాటిని ఎక్కువ విస్తీర్ణంలో సాగులోకి తేవాలన్నారు. ఆర్‌బీకే వేదికగా వచ్చే ఖరీఫ్‌కు పంటల ప్రణాళిక తయారు చేయాలని నిర్ణయించారు. రబీ ఈ–క్రాప్ నమోదును ఈ నెల 25లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రబీలో పప్పుశనగ పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నందున మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5,335 ప్రకారం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో త్వరగా కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి బి.రఘునాథరెడ్డి, ఏపీ సీడ్స్ డీఎం జే.ధనలక్ష్మి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి, మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, పట్టుశాఖ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

కిడ్నాప్ యత్నం కేసులో ముగ్గురికి రిమాండ్

యాడికి: యువతి కిడ్నాప్ యత్నం కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. పిన్నేపల్లికి చెందిన యువతిని పెళ్లి చేసుకోవాలంటూ అదే గ్రామానికి చెందిన భాస్కరరెడ్డి రెండేళ్లుగా వెంటపడేవాడు. ఈ నెల 17న ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిని తన స్నేహితులు చంద్ర, చిలక వెంకట్రాముడు, వన్నూరుస్వామి, రంగనాథ్‌తో కలసి డమ్మీ పిస్తోలుతో బెదిరించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు అడ్డగించడంతో పారిపోయారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కోన రహదారిలో భాస్కరరెడ్డి, వెంకట్రాముడు, వన్నూరుస్వామి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి డమ్మీ పిస్తోలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చూపి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతలబేమిటి?

- సీజ్డ్ బియ్యానికి అసాధారణ ధర
- వేలంలో కొన్న ప్రొద్దుటూరు కాంట్రాక్టర్
- దందా కోసమేనన్న అనుమానాలు



స్టాక్ పాయింట్‌లోని సీజ్ చేసిన బియ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: అవి సాదాసీదా బియ్యం. అయినా సోనాను మించి ధర పలికింది. సీజ్ చేసిన బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ వేసిన వేలంలో ప్రొద్దుటూరు కాంట్రాక్టర్ కిలో రూ.51.70తో కొనుగోలు చేసి అధికారులకు, తోటి వేలంపాటదారులకు షాకిచ్చారు. ఆలస్యంగా ఈ విషయం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల సంస్థ అధికారులు వివిధ సందర్భాల్లో సీజ్ చేశారు. అలా సీజ్ చేసిన 603.25 క్వింటాళ్ల బియ్యానికి ఈ నెల 13న అనంతపురంలో వేలం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ల (మిల్లర్లు) మధ్యే పోటీ నడిచింది. వీరిలో ఒక కాంట్రాక్టర్ కిలో బియ్యం రూ.51.70కు పాడి వేలం దక్కించుకున్నాడు. గతంలో ఐదు వేల క్వింటాళ్లకు వేలం నిర్వహించగా.. కిలో బియ్యం రూ.20 మాత్రమే పలికింది. తాజాగా నిర్వహించిన వేలంలో అప్పటి ధర కంటే రూ.31.70 అధికంగా పెట్టడం చూసి అధికారులే విస్తుపోయారు. వేలంలో బియ్యం అసాధారణ ధర పలికిన విషయాన్ని హెడ్ ఆఫీసు దృష్టికి తీసుకెళ్తామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నీలమయ్య తెలిపారు. బహిరంగ మార్కెట్లో నాణ్యమైన సోనా మసూరి రకం బియ్యం కిలో రూ.45కు మించి లేదు. అలాంటిది దానికన్నా తక్కువ నాణ్యత కలిగిన బియ్యానికి భారీ ధర వెచ్చించడం చర్చనీయాంశమైంది. వీటి ముసుగులో బియ్యాన్ని భారీఎత్తున అక్రమ రవాణా చేయొచ్చన్న ఉద్దేశంతో అధిక ధర పెట్టి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు నిఘా ఉంచితే లోగుట్టు రట్టయ్యే అవకాశం ఉంది.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ రేపు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్/ ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సానిపల్లి మంగమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని పార్టీ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం 11 గంటలకు నామినేషన్ వేసేందుకు బయల్దేరనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సేవాతత్పరులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, సానిపల్లి మంగమ్మను ఎమ్మెల్సీగా గెలిపించి, జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

మూడో రోజు ఏడు నామినేషన్లు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు మూడో రోజు సోమవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ మద్దతుతో పోతుల నాగరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే ఎం.ఆనంద్‌కృష్ణ, పి.చంద్రశేఖర్, ఆర్.చంద్రప్ప, ఎస్.అమృత కుమార్ (రెండవ సెట్), ఎన్.రమేష్‌నాయుడు కూడా స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 11 నామినేషన్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి మూడు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు.



అశేష భక్త జనసందోహం నడుమ సాగుతున్న బుగ్గ రామలింగేశ్వరస్వామి రథోత్సవం

వైభవంగా రథోత్సవం

తాడిపత్రిలో బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు సోమవారం ఉదయం రాజరాజేశ్వరీ - బుగ్గ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. హరహర మహాదేవ శంభో శంకరా.. కైలాసనాథా.. కోరిక తీర్చే బుగ్గ రామలింగేశ్వరా...నామస్మరణతో పుర వీధులు ప్రతిధ్వనించాయి. నలుమూలల నుంచి తరలివచ్చిన భక్త జన సందోహంతో తాడిపత్రి కిటకిటలాడింది. – తాడిపత్రి టౌన్



రాజరాజేశ్వరీదేవి - బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 55 వినతులు



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి 55 వినతులు అందాయి. అర్జీలను ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప స్వయంగా స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలో ఉన్నవాటికి తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రవీంద్రనాథ్ కన్నుమూత



ఆచార్య ఎల్‌కే రవీంద్రనాథ్ (ఫైల్)

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌కే రవీంద్రనాథ్ సోమవారం అనంతపురంలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. 30 ఏళ్ల పాటు పాటు ఆయన ఎస్కేయూ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ , అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా అంకితభావంతో పనిచేశారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గాను, కెమిస్ట్రీ విభాగాధిపతిగాను పనిచేశారు. ఆయన మృతి పట్ల మాజీ ప్రొఫెసర్లు డాక్టర్ పి.రవీంద్రారెడ్డి, డాక్టర్ శ్రీరాములు, ప్రస్తుత ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధాకరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అనిత ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

వీడిన జంట హత్యల మిస్టరీ

- ఆస్తి పంపకాల నేపథ్యంలోనే ఘాతుకం
- తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- వాహనాలతో పాటు పిడి బాకు, హార్డ్ డిస్క్ ముక్కలు స్వాధీనం



నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

గుంతకల్లు: పట్టణంలో సంచలనం సృష్టించిన జంట హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆస్తి పంపకాల నేపథ్యంలోనే భూస్వామి జీపీ హేమకోటిరెడ్డి, అడ్డుకోబోయిన ఆయన డ్రైవర్ హత్యకు గురైనట్లు విచారణలో తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన నలుగురితోపాటు హత్యకు సహకరించిన మరో ఐదుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ నర్సింగప్ప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐలు గణేష్, రామసుబ్బయ్యతో కలిసి మీడియాకు వెల్లడించారు. ఈ నెల 14న భూస్వామి జీపీ హేమకోటిరెడ్డి, ఆయన డ్రైవర్ షేక్షావలి హత్యకు గురయ్యారు. ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు డీఎస్పీ నరసింగప్ప ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. నలుగురు సీఐలు, ఎస్‌ఐలతో కలిపి ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. ఈ కేసులో నిందితులైన తొమ్మిది మంది సోమవారం ఉదయం గుత్తి సమీపంలోని ఎన్‌హెచ్-44లో ఉన్న బాట సుంకులమ్మ గుడి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రెండు కార్లు, ఒక పల్సర్ ద్విచక్ర వాహనం, హత్యకు ఉపయోగించిన పిడి బాకు, కాల్చి వేసిన సీసీ టీవీ ఫుటేజీల హార్డ్ డిస్క్ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తి పంపకాల వివాదమే..

హేమకోటిరెడ్డి హత్యకు ప్రధాన కారణం ఆస్తి పంపకాల్లో తలెత్తిన వివాదమేనని విచారణలో వెల్లడైంది. మూడు దశాబ్దాలుగా హేమకోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి మధ్య ఆస్తి వివాదాలు నడుస్తున్నాయి. పాత గుంతకల్లుకు చెందిన జీపీ కేశవరెడ్డి, మంతకల్లురెడ్డి అన్నదమ్ములు. కేశవరెడ్డికి ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డితోపాటు మాలతి సంతానం కాగా.. మంతకల్లు రెడ్డికి భాస్కర్‌రెడ్డి, హేమకోటిరెడ్డి, నీలకంఠరెడ్డి సంతానం. ఈ కుటుంబాల మధ్య ఆస్తి వివాదాల్లో అనేక క్రిమినల్ కేసులతోపాటు కోర్టులో కేసులు కూడా నడుస్తూనే ఉన్నాయి. వీరిలో నీలకంఠరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి చనిపోయారు. ఇక మిగిలిన హేమకోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. సుధాకర్‌రెడ్డి గుంతకల్లు వదిలి తెలంగాణలోని మక్తల్ గ్రామానికి మకాం మార్చాడు. అక్కడే హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. హేమకోటిరెడ్డిని ఎలాగైనా చంపాలని వైఎస్సార్ జిల్లా రమణపల్లికి చెందిన చిట్టిబాబుకు ఒకసారి, మరోసారి పాతగుంతకల్లుకు చెందిన బోయ ప్రసాద్‌కు, ఇంకోసారి గుంతకల్లులోని ఆలూరు రోడ్డుకు చెందిన మోసిన్, అనంతపురానికి చెందిన హనీఫ్, తాడిపత్రి రావివెంకటాంపల్లికి చెందిన కృష్ణయ్యలకు సుపారీలు ఇచ్చి.. ఫెయిలయ్యాడు. గత జనవరి 19న సుధాకర్‌రెడ్డి చనిపోయాడు. దీంతో సుధాకర్‌రెడ్డి భార్య సుగుణ, కొడుకు భరతసింహారెడ్డిలు హేమకోటిరెడ్డి హత్యకు పథకం పన్నారు.

15 రోజులుగా రెక్కీ..

హేమకోటిరెడ్డిని చంపాలని 15 రోజులుగా పక్కా రెక్కీ నిర్వహించారు. భరత్‌సింహారెడ్డితోపాటు ఈయన తల్లి సుగుణమ్మ, మేనమామలు దేవేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వారి రెస్టారెంట్‌లో పనిచేసే దీపం సుబ్బరాయుడు, ఈడిగ ప్రకాష్‌గౌడ్‌తో హత్యకు ప్రణాళిక రచించారు. హేమకోటిరెడ్డి ఇంటి సమీపంలోనే తిరుగుతూ ఆయన కదలికలపై నిఘా పెట్టారు. వీరికి మక్తల్‌కు చెందిన చెండేపల్లి దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి చెల్లెలు మాలతి (దూదేకుల మాబు (లేట్)ను ప్రేమ వివాహం చేసుకుంది), ఈమె కుమారుడు అబ్దుల్లాతోపాటు మల్లేనుపల్లికి చెందిన వడుగూరు గోవిందప్ప సహకరించారు. ఈ నెల 14న హేమకోటిరెడ్డి ఇంటి బయట భరతసింహారెడ్డి, సుబ్బరాయుడు, ప్రకాష్‌గౌడ్‌లు మాట్లాడుకున్నారు. తర్వాత ఇంట్లోకి భరత్‌సింహారెడ్డి, సుబ్బరాయుడు వెళ్లారు. ప్రకాష్‌గౌడ్ బయటే ఉండి పరిస్థితులు గమనిస్తున్నాడు. ఇంట్లోకి వెళ్లిన భరతసింహారెడ్డి తాను కేశప్ప మనవడినని, ఆస్తి పత్రాలపై సంతకాలు చేయాలంటూ చెప్పడంతో హేమకోటిరెడ్డి బెదిరించాడు. మొండికేసిన హేమకోటిరెడ్డిని పిడి బాకుతో పొడిచాడు. అదే సమయంలో అడ్డుకోవడానికి వచ్చిన డ్రైవర్ షేక్షావలిని కూడా చంపి పారిపోయారు. ఈ హత్యలతో సంబంధం ఉన్న ఈ తొమ్మిది మందితోపాటు గతంలో సుధాకర్‌రెడ్డి సుపారీలు ఇచ్చిన మరో ఆరుగురిపై (పరారీలో ఉన్నారు) కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులోని నిందితుల్లో తొమ్మిది మందిని సోమవారం ఉదయం గుత్తి సమీపంలోని ఎన్‌హెచ్-44లో అరెస్ట్ చేశారు. వీరిని మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన టూటౌన్ సీఐ గణేష్, వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ తిరుపాల్, ఏఎస్‌ఐలు శాంతిరాముడు, పద్మావతి, హెడ్ కానిస్టేబుళ్లు శివప్రసాద్, శంకరయ్య, వెంకటేష్, బాబా మున్వర్ వై.ఓబుళపతి, కానిస్టేబుళ్లు చిరంజీవి, ఎర్రిస్వామి, బాబు, మురళిలను డీఎస్పీ అభినందించారు.

రెచ్చిపోయిన దారిదోపిడీ దొంగలు

గుత్తి రూరల్/పెద్దపప్పూరు: లారీ డ్రైవర్లను చితకబాది నగదు అపహించుకెళ్లిన ఘటన జిల్లాలో సంచలనం రేకెత్తించింది. వివరాలు..

- లారీ డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్న నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన దస్తగిరి, శ్రీరామ్‌నగర్ నివాసి శ్రీనివాసులు తమిళనాడులోని పెరంబదూరు నుంచి ఎండు కొబ్బరి లోడుతో ఆదివారం సాయంత్రం గుంతకల్లుకు చేరుకుని సరుకు అన్‌లోడ్ చేసి డోన్‌కు బయలుదేరారు. గుత్తి శివారులోని బాట సుంకులమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న పెట్రోల్ బంకు వద్ద లారీ ఆపి నిద్రించారు. సోమవారం వేకువ జాము 2.30 గంటలకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు డ్రైవర్లకు మత్తు మందు ఇచ్చి స్పృహ కోల్పోయాక జేబులు కత్తిరించి దస్తగిరి వద్ద రూ.48వేలు, రూ.15వేలు విలువ చేసే సెల్‌ఫోన్, శ్రీనివాసులు వద్ద రూ.వెయ్యి దోచుకెళ్లారు. అనంతరం బసినేపల్లి శివారులో లారీలో నిద్రిస్తున్న మరో డ్రైవర్‌ను కత్తులతో బెదిరించి రూ.22వేలు, ఎంగిలిబండ శివారులో టాటా ఏస్ డ్రైవర్‌ను కత్తులు బెదిరించి రూ.18వేలు అపహరించుకెళ్లారు. టాటా ఏస్ డ్రైవర్ గుత్తికి చేరుకుని గాంధీ చౌక్ వద్ద గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు విషయాన్ని వివరిస్తుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులను చూసి గట్టిగా కేకలు వేసి పోలీసులను అప్రమత్తం చేశాడు. ఈ లోపు దుండగులు తాడిపత్రి వైపుగా వాహనాన్ని మళ్లించి తప్పించుకున్నారు. మూడు ఘటనలపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు.
- పెద్దపప్పూరు మండలం జోడిధర్మాపురం టోల్‌గేట్‌కు చేరువలో లారీ డ్రైవర్‌ను దుండగులు చితకబాది నగదు దోచుకెళ్లారు. సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులకు బాధితుడు మస్తాన్ ఫిర్యాదు చేశాడు. లారీలో సరుకు తీసుకుని బళ్లారికి బయలుదేరిన మస్తాన్ సోమవారం తెల్లవారుజామున జోడిధర్మాపురం టోల్‌గేట్‌కు చేరువలో వాహనాన్ని ఆపి బహిర్భూమికి వెళ్లాడు. అదే సమయంలో పల్సర్ బైక్‌పై వచ్చిన యువకులు మస్తాన్‌పై దాడి చేసి రూ.5,300 దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గాలింపునకు ప్రత్యేక బృందాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గుత్తి, పెద్దపప్పూరు ప్రాంతాల్లో లారీ డ్రైవర్లను బెదిరించి నగదు దోచుకెళ్లిన యువకుల కోసం పోలీసుల వేట మొదలైంది. గుంతకల్లు, సీసీఎస్ డీఎస్పీలు మహబూబ్‌బాషా, నర్సింగప్ప పర్యవేక్షణలో బృందాలు ఏర్పాటయ్యాయి.

'ఉద్యోగుల క్షేమం కోసమే మృత్యుంజయ హోమం'

అనంతపురం: ఉద్యోగుల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఎస్కేయూలో ఈ నెల 24న మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్కేయూలో పనిచేస్తున్న ఐదుగురు ఉద్యోగులు కేవలం నెల రోజుల వ్యవధిలోనే అకాల మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు వివరించారు. బోధన, బోధనేతర ఉద్యోగులు స్వచ్ఛందంగా ఇందులో పాల్గొనవచ్చునన్నారు. అంతేకాక హోమం నిర్వహణకు విరాళాలు సైతం స్వచ్ఛందంగా అందజేయాలని కోరినట్లు తెలిపారు. ఇందులో ఎవరినీ బలవంతం చేయలేదన్నారు. ఉద్యోగులు పదికాలాల పాటు ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వక్రీకరించడం భావ్యం కాదన్నారు. 1996-97లో అప్పటి వీసీ పీఆర్ నాయుడు మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారని, అదే తరహాలో ప్రస్తుతం హోమాన్ని నిర్వహించాలన్న బోధనేతర ఉద్యోగుల కోరికను మన్నించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, జనరల్ సెక్రెటరీ శాంతలింగం, మినిమం స్కేలు ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్లప్ప, శ్రీనివాసరెడ్డి, హాస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు హుస్సేన్‌పీరా స్పష్టం చేశారు. తమ అభ్యర్థన మేరకే ఈ హోమాన్ని నిర్వహిస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు. కాగా, మృత్యుంజయ హోమ నిర్వహణకు సంబంధించిన సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలంటూ వీసీ రామకృష్ణారెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

వీడిన 17 ఏళ్ల అజ్ఞాతవాసం!



మహబూబ్‌బాషాను చూపుతున్న సీఐ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 17 ఏళ్ల పాటు కుటుంబ పెద్ద అజ్ఞాత జీవనానికి తెరపడింది. సంక్లిష్టమైన ఈ కేసును అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి ఛేదించి కుటుంబసభ్యులను ఏకం చేశారు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని టీవీ టవర్ సమీపంలో 2006లో మహబూబ్‌బాషా, ఫాతిమా దంపతులు నివాసముండేవారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. వక్ఫ్‌బోర్డు భూములకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషా 2006లో సొంత పనిపై మరో ప్రాంతానికి వెళుతూ.. వక్ఫ్‌భూముల వద్ద కాపలా ఉండాలని తన భార్య ఫాతీమాకి సూచించాడు. నాలుగు రోజుల తర్వాత ఇంటికి చేరుకున్న అతను.. వక్ఫ్ భూముల్లో నుంచి భారీగా ఇసుక తరలించినట్లు గుర్తించి, భార్యను నిలదీశాడు. తనకు తెలియదని ఆమె చెప్పినా వినలేదు. చేతికందిన కర్ర తీసుకుని చితకబాదాడు. ఘటనలో ఆమె చెయ్యి విరిగింది. దీంతో అప్పట్లో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తనను అరెస్ట్ చేస్తారని భయపడి ఇంట్లో చెప్పకుండా మహబూబ్ బాషా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం కుమారులకు తండ్రి కనిపించనట్టే కనిపించి వెళ్లిపోయాడు. విషయాన్ని వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డికి తెలిపి పాత కేసును గుర్తు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో బీహెచ్‌ఈఎల్‌లో సాయిబాబా గుడి వద్ద వాచ్‌మెన్‌గా ఉన్న మహబూబ్‌బాషాను గుర్తించి సిబ్బందిని పంపి మంగళవారం అనంతపురానికి పిలుచుకువచ్చారు. విచారణ అనంతరం కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

సెపక్‌తక్రా బాలుర విజేత అనంత



అండర్-17 బాలుర విజేతగా నిలిచిన జిల్లా జట్టు

ఉరవకొండ: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా అండర్ 17 బాలుర విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను పశ్చిమగోదావరి జిల్లా జట్టు దక్కించుకున్నాయి. ఉరవకొండలోని పోలీసు క్రీడామైదానం వేదికగా ఈ నెల 19న ప్రారంభమైన అండర్ 14, 17 బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. పది జిల్లాల జట్లు ప్రాతినిథ్యం వహించగా.. డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించారు. అండర్-14 బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై పశ్చిమ గోదావరి, అండర్-17 బాలుర విభాగంలో అనంతపురం జిల్లా జట్టుపై పశ్చిమ గోదావరి జిల్లా జట్టు, అండర్-17 బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ట్రోఫీలను గుత్తి డిప్యూటీ డీఈఓ శంకరప్రసాద్, సీఐ హరినాథ్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంఈఓ ఈశ్వరప్ప, ఆర్‌ఎస్ డీటీ మునీంద్ర ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి మొరార్జీయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

జీడీఎస్ ఉద్యోగుల సహాయ నిరాకరణ

అనంతపురం సిటీ: తపాలా శాఖలో పని చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు సోమవారం నుంచి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టారు. టార్గెట్లు విధించి వేధింపులకు గురి చేయడాన్ని నిరసిస్తూ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టినట్లు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్(ఏఐజీడీఎస్‌యూ), నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్(ఎన్‌యూజీడీఎస్) ప్రతినిధులు తెలిపారు. తాము విధులకు హాజరైనా, ఎలాంటి కొత్త డిపాజిట్లు, పాలసీలు తీసుకోబోమని యూనియన్ ప్రతినిధి కృష్ణయ్య యాదవ్ తెలిపారు.

103 సెల్‌ఫోన్ల అందజేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చాట్‌బాట్ సేవల ద్వారా పోలీసులు రికవరీ చేసిన 103 సెల్‌ఫోన్లను సంబంధీకులకు సోమవారం ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ... ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కొరియర్ ద్వారా సెల్‌ఫోన్లను అందజేయనున్నట్లు తెలిపారు. చాట్‌బాట్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.8.63 కోట్లు విలువ చేసే 5,325 సెల్‌ఫోన్లు రికవరీ చేసి, సంబంధీకులకు అందజేసినట్లు వివరించారు. అనంతరం చాట్‌బాట్ టెక్నికల్ విభాగానికి ప్రత్యేక దుస్తులను అందజేశారు.

స్కూలు వ్యాన్ బోల్తా

కనగానపల్లి: మండలంలోని బద్దలాపురం సమీపంలో తగరకుంటలోని ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ సోమవారం సాయంత్రం కాలువలో బోల్తాపడింది. ప్రమాద సమయంలో అందులో ప్రయాణిస్తున్న 15 మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నరసంపల్లికి చెందిన విద్యార్థి అమరనాథ్ కుడిచేయి విరిగింది. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని పిల్లలను తగరకుంట పీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- ఓటర్ల జాబితా పరిశీలనలో అధికారుల తలమునకలు

జెడ్పీటీసీ సభ్యుల సంఖ్య	63
ఎంపీటీసీ సభ్యుల సంఖ్య	841
రాజీనామా చేసిన ఎంపీటీసీలు	01
మరణించిన ఎంపీటీసీ సభ్యులు	03

పార్టీల వారీగా ఎంపీటీసీ సభ్యులు ఇలా..

పార్టీ	సభ్యుల సంఖ్య
వైఎస్సార్‌సీపీ	769
టీడీపీ	54
కాంగ్రెస్	01
బీజేపీ	01
సీపీఐ	01
సీపీఎం	01
జనసేన	01
స్వతంత్రులు	13
మొత్తం	841

అనంతపురం సిటీ: శాసన మండలి (ఎమ్మెల్సీ) స్థానిక సంస్థల విభాగానికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జెడ్పీ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పరిశీలనలో అధికారులు తలమునకలయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంత మంది జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులున్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్లే కీలకం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్లే కీలకం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మంది జెడ్పీటీసీ సభ్యులుండగా, వీరిలో 61 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కావడం గమనార్హం. అగళి నుంచి టీడీపీ అభ్యర్థి, రొళ్ల మండలం నుంచి స్వతంత్ర అభ్యర్థి జెడ్పీటీసీలుగా గెలిచారు. అలాగే 63 మండలాల నుంచి మొత్తం 841 మంది ఎంపీటీసీ సభ్యులుండగా వీరిలో ప్రస్తుతం 837 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిలో ఆత్మకూరు-1 ఎంపీటీసీ సభ్యురాలు లీలావతి తన పదవికి రాజీనామా చేశారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం ఎంపీటీసీ సభ్యుడు గొల్ల గోవిందప్ప, విడపనకల్లు-1 నుంచి గెలుపొందిన బెస్త సుంకన్న, రాయదుర్గం మండలం కెంచనపల్లి ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ నాయుడు (ముగ్గురూ వైఎస్సార్‌సీపీ సభ్యులే) మరణించారు. దీంతో ఆయా స్థానాలు ఖాళీగా ఉండిపోయాయి.

డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు రెవెన్యూ డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. జాబితాలో అభ్యర్థుల పేర్లు, ఇతర వివరాలు సమగ్రంగా ఉన్నది...లేనిది, అక్షర దోషాలు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. మూడ్రోజులుగా రేయింబవళ్లూ కొనసాగుతున్న ఈ ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో ఓ కొలిక్కి వచ్చే అవకాశముంది.

ఫాల్గుణం... విష్ణు ప్రీతికరం

- మాసమంతా నృసింహుడి బ్రహ్మోత్సవాల సందడి



కళ్యాణదుర్గం కోటలోని వేపచెట్టులో వెలసిన నారసింహుడు

అనంతపురం కల్చరల్: ఫాల్గుణం విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. ఇంతటి విశిష్టమైన ఫాల్గుణ మాసం ఈ నెల 21 నుంచి (మంగళవారం) నుంచి ప్రారంభం కానుంది. మాసాలలో ఫాల్గుణ మాసానికి ఓ ప్రత్యేకత ఉన్నట్లే.. దశావతారాల్లోనూ నృసింహావతారానికి అత్యంత విశిష్టత ఉంది. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి విష్ణుదేవుడికి క్షీరాన్నం నివేదిస్తే కోరికలు సిద్ధిస్తాయని భాగవత పురాణం చెబుతోంది. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణ మాసం. ఇంతకు ముందున్న పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ చివరి మాసంలో మళ్లీ పునరావృతం కావడం విశేషం. ఫాల్గుణమాసం వచ్చిందంటే ప్రతి చోట శ్రీలక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

వేపచెట్టులో వెలసిన నారసింహుడు

తాను సర్వాంతర్యామి అని ప్రకటించుకున్నట్టు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నరసింహస్వామి ఆలయాలు ప్రత్యేకతను చాటుతున్నాయి. కళ్యాణదుర్గంలోని కోట వద్ద వేపచెట్టులోనే సింహాకారం దాల్చిన రూపంలో లక్ష్మీనరసింహస్వామి నీరాజనాలందుకుంటున్నారు. పవిత్ర క్షేత్రమైన కదిరిలో హిరణ్యసంహారం చేస్తున్నట్టున్న విగ్రహం , పక్కనే ప్రహ్లాదరూపం ఉంటుంది. మార్చి 2న కదిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 16రోజుల పాటూ ఆధ్యాత్మిక భావజాలాన్ని వ్యాప్తి చేస్తాయి. రాక్షసవధ గావిస్తూ పెన్నహోబలిలంలో శ్రీవారు పాదం మోపాడని ప్రతీతి. కాబట్టే శ్రీవారి పాదమే ఇక్కడ విశేష పూజలందుకుంటోంది. ఆ కోవకు చెందినదే సుప్రసిద్ధ పంపనూరుకు సమీపంలో కొండపై వెలసిన మలహోబిల నరసింహస్వామి ఆలయం. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల తదితర ప్రాంతాల్లోనూ ఆదిదేవుడైన నరసింహుడు వివిధ రూపాలలో దర్శనమిస్తూ కోరిన కోర్కెలను నెరవేరుస్తూ భక్తకోటి ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్నాడు. అనంతపురం పాతూరు వ్యాసరాజ మఠంలోని నరసింహ స్వామి ఆలయం.. నగరంలోనే ఏకైక ఆలయంగా ఖ్యాతిగడించింది. ఫాల్గుణ మాసమంతా ఈ ఆలయంలో విశేష పూజలు ఉంటాయని ఆలయ ప్రతినిధి రఘు తెలిపారు.

క్లుప్తంగా

24న దేవులపల్లి అమర్ రాక

అనంతపురం అర్బన్: జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ ఈనెల 24న జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అనంతపురం చేరుకొని ప్రభుత్వ అతిథి గృహంలో విడిది చేస్తారు. అధికారులు, అనధికారులను కలుస్తారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి ఇక్కడే బస చేస్తారు. 25న ఉదయం 11 గంటలకు లలిత కళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన 'జర్నలిజం నాడు–నేడు' సదస్సులో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి హైదరాబాదు వెళతారు.

ఉయ్యాలవాడ వర్ధంతి నిర్వహించండి

అనంతపురం టవర్‌క్లాక్: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రెడ్డి సంఘాల నాయకులు నిర్వహించాలని ఏపీరెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22న విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు.

'సైబర్ నేరాలు– మహిళా రక్షణ చట్టాలు'పై అవగాహన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని ఎంబీఏ విభాగంలో సైబర్ నేరాలు– మహిళా రక్షణ చట్టాలు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ మహిళా న్యాయవాది ఎస్. వహీదా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి. నారాయణ రెడ్డి, డాక్టర్ డి. వరలక్ష్మి, డాక్టర్ పి. జయరామి రెడ్డి, డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ కే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాధవరాజుల పరుష ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో మాధవరాజుల స్వామి

ఆత్మకూరు: సనపలో మాధవరాజుల ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పూజారులు, గ్రామస్తులు కొలనుకు వెళ్లి చెరకు తీసుకొచ్చి పూజ చేశారు. అనంతరం మాధవరాజుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ముగిసిన మాఘమాస పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారంతో మాఘమాస పూజలు ముగిశాయి. మంజునాథ స్వామి వారికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు అందించారు. అనంతరం మహామంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పప్పూరు జీవితం ఆదర్శప్రాయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఎమ్మెల్యేగా, మునిసిపల్ చైర్మన్‌గా, గ్రంథాలయోద్యకారుడిగా చిరస్మరణీయ సేవలందించిన పప్పూరు రామాచార్యుల జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలన్నారు. ప్రముఖ రచయిత రావినూతల శ్రీరాములు రచించిన 'రాయలసీమ వైతాళికుడు పప్పూరు రామాచార్యులు' పుస్తకాన్ని పప్పూరు వారి మనవడు, మనవరాలితో కలిసి సోమవారం అనంతపురంలోని అరవిందనగర్‌లో డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు ఆవిష్కరించారు.సమితి గౌరవ సలహాదారుడు డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్ అహమ్మద్, కార్యదర్శి తోటనాగరాజు మాట్లాడారు. పప్పూరు వారి గురించి తెలియని ఎన్నో ఆసక్తికరమైన విషయాలను రచయిత ప్రస్తావించారని, ఇది జిల్లా వాసులకు ఎంతో ఆనందాన్ని కలిగించే విషయమన్నారు. రామాచార్యుల మనవడు ధర్మవరం విజయ్‌కుమార్, మనమరాలు జమున మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి, కల్లూరు సుబ్బారావు, బళ్లారి రాఘవ వంటి ప్రముఖులతో తమ తాతకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వదరుబోతు రచనల ద్వారా రామాచార్యులు చేసిన కృషి మరువలేనిదన్నారు.

దర్భశయనానికి చం.పురస్కారం

అనంతపురం కల్చరల్: ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్యకు చం. స్పందన ఆత్మీయ సాహితీ జీవన సాఫల్య పురస్కారం అందించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు చంద్రశేఖరశాస్త్రి సోమవారం తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల కామర్స్ భవనంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి హాజరై దర్భశయనం కవిత్వంపై ప్రసంగిస్తారన్నారు.

ప్రభుత్వ బడులు..కార్పొరేట్ హంగులు

- నాడు అధ్వానం.. నేడు ఆధునికం
- రూపురేఖలు మారుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం



నాబార్డ్ నిధులతో రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌లో నిర్మించిన అదనపు గదులు



రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌లో రెండో విడతలో జరుగుతున్న నాడు–నేడు పనులు

రాప్తాడు: నాడు ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు, శిథిలావస్థకు చేరిన భవనాలు, చాలీచాలని గదులు ఉండేవి. ప్రహరీలు , క్రీడా మైదానాలు లేక విద్యార్థులు అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

రాప్తాడు మండలంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో చేపట్టిన పనులు పూర్తి కాగా రెండో విడతలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో మండలంలో రూ.4.93 కోట్ల నిధులతో 15 పాఠశాలలను అభివృద్ధి చేసిన ప్రభుత్వం, రెండో విడతలో రూ.5.99 కోట్లతో 26 పాఠశాలలు, 5 అంగన్‌వాడీ కేంద్రాలను సుందరంగా నిర్మిస్తోంది.

మండలంలో రెండో విడత నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఎం.బండమీదపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి రూ. 15.76 లక్షలు, రాప్తాడు, బోగినేపల్లి, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను రూ.5 లక్షలు చొప్పున నిధులతో అభివృద్ధి చేస్తున్నారు.

సర్కారు బడుల ఆధునీకరణ

మండలంలో కేజీబీవీలకు రూ. 11 లక్షలు, అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.19.84 లక్షలు, ఎం.బండమీదపల్లి పాఠశాలకు రూ.12.05 లక్షలు, బొమ్మేపర్తి పాఠశాలకు రూ.18 లక్షలు, చాపట్ల పాఠశాలకు రూ.12 లక్షలు, ఎం.చెర్లోపల్లి పాఠశాలకు రూ.17.89 లక్షలు, చిన్మయనగర్ పాఠశాలకు రూ.19.83 లక్షలు, గంగలకుంట పాఠశాలకు రూ.15.95, గొల్లపల్లి పాఠశాలకు రూ.17.94 లక్షలు, పాలబావి పాఠశాలకు రూ.15.99 లక్షలు, ధర్మవరం పంగల్ రోడ్డు పాఠశాలకు రూ15.9 లక్షలు, ప్రసన్నాయపల్లి పాఠశాలకు రూ.15.94, రామినేపల్లి పాఠశాలకు రూ.15.71 లక్షలు, మరూరు ఎస్సీ కాలనీ పాఠశాలకు రూ.11.93, రాప్తాడు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ.11.73 లక్షలు, బుక్కచెర్ల ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.18 లక్షలు నిధులు కేటాయించి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గాండ్లపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.51 లక్షలు, గొందిరెడ్డిపల్లి పాఠశాలకు రూ.40.47 లక్షలు, హంపాపురం పాఠశాలకు రూ0.84.04 లక్షలు, ఎం.బండమీదపల్లి పాఠశాలకు 68.95 లక్షలు, రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌కు రూ.69.77 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

జెడ్పీహెచ్ఎస్‌లకు అత్యధికం :

మండలంలో అత్యధికంగా రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌కు అత్యధికంగా నిధులు మంజూరయ్యాయి. దీంతో కార్పొరేటు పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మొదటి విడతలో నాబార్డ్ పథకం కింద రూ.80 లక్షలు రాగా, పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులతో పాటు టాయిలెట్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలతో పాఠశాల రూపురేఖలు మారాయి. రెండో విడతలో రూ. 69.77 లక్షలు నిధులు విడుదల కాగా, పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు



మనబడి నాడు–నేడు పథకంతో విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేశారు. ఈ పథకంతో సర్కారు పాఠశాలలు రూపురేఖలు మారాయి. ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలో రెండు విడతల్లో రూ.10.92 కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతో పాఠశాలలు సుందరంగా తయారయ్యాయి.

– మల్లికార్జున, ఎంఈఓ, రాప్తాడు

కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు



కార్పొరేట్ పాఠశాలల్లో లేని సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తున్నాయి. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల స్థితి గతులు మార్చేశాయి. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు విడతల్లో రూ.1.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొదటి విడతలో నాబార్డు కింద రూ.80 లక్షలతో పాఠశాల రూపురేఖలు మార్చి, సౌకర్యాలు మెరుగుపర్చారు. రెండో విడతలో రూ. 69.77 లక్షలతో పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు.

– నరసింహులు, హెచ్ఎం, రాప్తాడు జెడ్పీహెచ్ఎస్

ఆర్‌కే నగర్‌లో పనుల పరిశీలన



48వ డివిజన్‌లో మేయర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసులు

అనంతపురం క్రైం: నగరంలోని 48వ డివిజన్ ఆర్‌కే నగర్‌లో మేయర్ వసీం సోమవారం పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ మాలపాటి శ్రీనివాసులతో కలిసి నీటి సరఫరా ట్యాంకును పరిశీలించారు. తరచూ వాల్వ్ సమస్య వస్తోందని, కార్పొరేటర్ శ్రీనివాసులు మేయర్‌కు ఫిర్యాదు చేశారు. వేసవిలో మరోసారి వాల్వ్ సమస్య వస్తే ప్రజలు ఇబ్బందులు పడుతారని మేయర్‌కు తెలిపారు. మరోసారి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని మేయర్ చెప్పారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

ఎస్‌కేయూలో హోమం నిలిపివేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: విజ్ఞాన కేంద్రంగా విరాజిల్లాల్సిన శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మృత్యుంజయ హోమం జరపాలని వీసీ, రిజిస్ట్రార్ తీసుకున్న నిర్ణయం సరికాదని, తక్షణం ఆ చర్యను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయం విజ్ఞాన కేంద్రమే కాకుండా కుల, మత, ప్రాంతీయభావాలకతీతంగా ఉమ్మడి భావాలకు నిలయమన్నారు. తమ సొంత సంస్థల్లో వ్యక్తిగత విశ్వాసాలను ఆచరిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. విశ్వవిద్యాలయంలో ఇలాంటివి నిర్వహించాలని ప్రయత్నించడం లౌకిక భావాలకే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. వీసీ, రిజిస్ట్రార్ ఇద్దరూ సైన్స్ విభాగాల్లో పరిశోధనలు చేసివారే ఉండి కూడా ఇలాంటి అశాస్త్రీయ కార్యక్రమానికి సిద్ధపడడం సరికాదన్నారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: యాదవులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు జిట్టా రామ్మోహన్ యాదవ్ కోరారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిట్టా రామ్మోహన్ యాదవ్ మాట్లాడుతూ బీసీల్లో అధిక సంఖ్యలో ఉన్న యాదవులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ పదవి యాదవకులానికి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ యాదవ్, అజయ్ యాదవ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగుల యూనియన్ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ 2023 డైరీ, క్యాలెండర్ పోస్టర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి అని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికులు , ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను చేపట్టారన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పట్ల తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపట్టారని వారి సేవలను కొనియాడారు.విద్యుత్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి మారుతీప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బషీర్ అహమ్మద్, జిల్లా నాయకులు రామాంజనేయులు, బాబాఫకృద్దీన్, రామసుదర్శన్, ముషారఫ్, నాగార్జున, సురేష్, రామకృష్ణ, రామ్మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధంగా ఉంటాం

- జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్



మాట్లాడుతున్న జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉంటామని సంఘం జిల్లా చైర్మన్ దివాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈనెల 26లోపు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఈనెల 5న కర్నూలులో జరిగిన రాష్ట్ర మహాసభలో తీర్మానం చేశారన్నారు. 26వ తేదీలోపు సమస్యలు పరిష్కారం కాకపోతే నాయకత్వం చేపట్టే ఉద్యమానికి జేఏసీలోని అన్ని సంఘాలు మద్దతు పలుకుతూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం అసోసియేట్ చైర్మన్ మల్లరాయుడు, ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, ఉపాధ్యక్షుడు శివానందరెడ్డి, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, రెవెన్యూ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు కుల్లాయప్ప, గ్రామ, వార్డు సచివాలయ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి, డబ్ల్యూఎస్ఈడబ్ల్యూఓ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అంబేద్కర్‌నగర్‌లో కాలువ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: స్థానిక 21వ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో రూ.16 లక్షలతో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అమినిటీ ప్రసన్నను ఆదేశించారు. అనంతరం ఆయన మున్నానగర్, అంబేడ్కర్‌నగర్‌లోని పలు వీధుల్లో పర్యటించారు. రోడ్లు విస్తరణలో ఎక్కడా రాజీ కాకుండా పనులు పూర్తి చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మురికివాడలైన అంబేడ్కర్‌నగర్, మున్నానగర్‌లో కాలువ, రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈ ప్రాంతాల రూపురేఖలు మారిపోయాయన్నారు. . ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూస్తామన్నారు. డిప్యూటీ మేయర్ వెంట స్థానిక కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, కార్పొరేటర్లు లాలు, మునిశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు కుళ్లాయస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను సస్పెండ్ చేయాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలచెరువు ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే మెడికల్ ఆఫీసర్ అప్పయ్య, సూపర్‌వైజర్ మహమ్మద్ షబ్బీర్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి వినతిపత్రం అందించారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయన్ను కలిసి సంఘటనను వివరించారు. మహిళా ఉద్యోగులు, సిబ్బంది దుస్తులు మార్చుకుంటుండగా వీడియో తీసిన వారిపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించిన బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. సంఘటనకు సంబంధించి యాడికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అటెండర్ నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లో మెడికల్ ఆఫీసర్ అప్పయ్య, సూపర్‌వైజర్ మహమ్మద్ షబ్బీర్ పేర్లను కూడా నమోదు చేసినట్లు తెలిపారు. వారిని కూడా సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

28న నాయీ బ్రాహ్మణ కృతజ్ఞత సభ



నాయీబ్రాహ్మణ కృతజ్ఞత సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నాయీబ్రాహ్మణ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా నాయీబ్రాహ్మణ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 28న తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్న నాయీబ్రాహ్మణ కృతజ్ఞత సభ పోస్టర్లను విడుదల చేశారు. సంఘం రాష్ట్ర డైరెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలు సమాజానికి వెన్నెముక అని నిరూపిస్తూ వారి అభ్యున్నతి చారిత్రాత్మకమైన నిర్ణయాలను తీసుకున్నారన్నారు. సేవకులుగా ఉన్న నాయీ బ్రాహ్మణులను పాలకులుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దని అన్నారు. వందలాది మంది బీసీలకు పదవులను అందించారన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయీబ్రాహ్మణులను కించపరుస్తూ మాట్లాడారన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు నరసింహులు, విజయభాస్కర్, శివకుమార్, బంకు శ్రీన, రామకృష్ణ, రామాంజి, అనిల్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, బయన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: క్రీడలతో మానసిక , శారీరక వికాసం సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం–ఓటీపీఆర్ఐ వార్షికోత్సవాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు వార్షికోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించి, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ జీవితంలో గెలుపు, ఓటమి సహజం అన్న భావనతో గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఓర్పు, శక్తి, పట్టుదల, సహనంతో క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహా మృత్యుంజయ యాగం శుభపరిణామం



మృత్యుంజయ యాగానికి మద్దతు తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మహా మృత్యుంజయ యాగాన్ని నిర్వహిస్తుండడం శుభపరిణామం అని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఉద్యోగులు అనారోగ్యంతో మృతి చెందారు. ఉద్యోగుల క్షేమం కోసం నిర్వహిస్తున్న యాగానికి కొందరు మతం రంగు పులుముతూ అడ్డుకునే ప్రయత్నాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోంది. యాగాలు అంటే నమ్మకం లేని వారు దూరంగా ఉండాలని, పాల్గొనకూడదు తప్ప రాద్ధాంతం చేయకూడదన్నారు. ఉద్యోగుల క్షేమానికి మహా మృత్యుంజయ యాగాన్ని నిర్వహించడాన్ని ఏబీవీపీ స్వాగతిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చెన్నయ్య, చిన్నాశ్రీరామ్, యుగంధర్ బాబు, కమలాకర్, ప్రసాద్, రుషి, ఇంద్ర, దివాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై అభిషేక ప్రియుడు



పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరుడు



చిన్నారుల నృత్య ప్రదర్శన

- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాలు పదిరోజులుగా అనంతవాసులను భక్తిభావంలో ముంచెత్తాయి. సోమవారం రాత్రి ఆదిదేవుడు సతీసమేతుడై అశ్వవాహనంపై ఊరేగాడు. భజన బృందాల శివనామ స్మరణ ఉత్సవాలకు మరింత శోభను తెచ్చాయి. మహాశివరాత్రి పర్వదినాల ముగింపు సందర్భంగా ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం చేసిన శాస్త్రీయ నాట్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భగవత్ సంకీర్తనలతో నృత్య కళానిలయం చిన్నారులు ఆట పాటలతో మైమరిపించి, అధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు మాట్లాడుతూ శ్రీశైలంలో జరిగే పద్ధతుల్లో సాగిన మహాశివుడి బ్రహ్మోత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగుస్తాయని తెలిపారు.

నేడు రామకృష్ణ పరమహంస జయంతి

అనంతపురం కల్చరల్: రామకృష్ణ పరమహంస 188వ జయంతిని మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీధరమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలో ఉదయం వేదపఠనం, రామకృష్ణుల కథా సాగరం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం నృత్యకళా నిలయం చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. చిన్మయామిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి ప్రవచనం చేస్తారని, అందరూ పాల్గొనాలని కోరారు.